

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం తలకొండపల్లి మండల కేంద్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. - కడ్తాల్ (తలకొండపల్లి)


# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, ఆదివారం 27 అక్టోబర్ 2024 | VIKARABAD



రోటిబండ తండాలో రైతుల ఆగ్రహం (ఫైల్)

# ఆవేదన.. ఆవేశమై..



- ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలతో తీవ్రతరం
- ఫార్మా విలేజ్‌కు భూములు ఇచ్చేది లేదంటూ తెగేసి చెబుతున్న అన్నదాతలు

# ఫార్మా పోరు.. ముమ్మరమై..

## సీఎంకు కాంగ్రెస్ నాయకులే ముఖ్యమా.. రైతులు వద్దా ?

## ఫార్మాను రద్దు చేసే వరకు పోరాటం ఆగదు..

## తీరు మారకుంటే కాంగ్రెస్ నేతలకు గుణపాఠం తప్పదు

## ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్న ఫార్మా విలేజ్ బాధిత రైతులు

కొడంగల్, అక్టోబర్ 26 : తమ భూములను కాపాడుకునేందుకు గత ఎనిమిది నెలలుగా నిద్ర లేని రాత్రులు గడుపుతున్నామని ఫార్మా విలేజ్ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలు, ఇలా ఏదో ఒక రూపంలో నిరసన తెలుపుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి మనస్సు మాత్రం కరగడంలేదని వాపోతున్నారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ముఖ్యమంత్రి కావడంతో చాలా సంతోషించామని.. మా ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని.. పంట పొలాలకు సమృద్ధిగా నీరు అందుతుందని ఆశిస్తే.. ఆయన మా భూముల్లోనే కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కుయుక్తులు పన్నుతున్నారని, ప్రాణాలు పోతాయని చెబుతున్నా పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. సీఎంకు ఒక్కసారి కూడా రైతుల సమ స్యలను తెలుసుకునేందుకు సమయమే దొరకడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. కాం గ్రెస్ పార్టీ నాయకులు రైతులకు ఫోన్లు చేసి ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూములు ఇవ్వాలని బెదిరిస్తున్నారని, ఇవ్వకుంటే మీ భూములను లాక్కోవడం ఖాయమని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ పచ్చటి పొలాలను ఇచ్చి ఎక్కడికెళ్లాలి.. ఏమి తిని బతకాలని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చే రూ.10 లక్షలు, ప్రైవేట్ ఉద్యోగం మమ్మల్ని ఎన్ని రోజులు కాపాడుతుంది.. మా పిల్లలకు భూములు ఉండొద్దా..? వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవించాలా..? అని ప్రశ్నిస్తున్నారు. రోటిబండతండాలో జరిగిన పోలీసుల లాఠీచార్జిలో పలువురు రైతులు సొమ్మసిల్లి పడిపోయారని.. తమ భూములను కాపాడుకునేందుకు ఓ యువకుడు పెట్రోల్‌తో ఆత్మబలిదానం చేసేందుకు సిద్ధమైనా సీఎం రేవంత్‌రెడ్డి మనసు చలించడం లేదా.. అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులే ముఖ్యమా.. రైతులు అవసరం లేదా..?.. అని మండిపడుతున్నారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం.. మా పంట పొలాలను ఫార్మా విలేజ్‌కు ఇచ్చే ప్రసక్తే లేదని.. దానిని రద్దు చేసేవరకూ ప్రభుత్వంతో ఎంతవరకైనా పోరాడుతామ ని, అవసరమైతే ప్రాణత్యాగం చేసేందుకు కూడా సిద్ధమని వారు తేల్చి చెబుతున్నారు. రోటిబండ తండాలో జరిగిన సంఘటనలో తమ ఆవేశాన్ని చూస్తున్నారే గాని, దాని వెనకున్న ఆవేదనను అర్థం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### సీఎంకు కాంగ్రెస్ నాయకులే కావాలా..?



సీఎం రేవంత్‌రెడ్డికి తన సెగ్మెంట్ లోని రైతులు అవసరం లేనట్లుగా ఉన్నది. గత 8 నెలలుగా ఫార్మా కంపెనీల ఏర్పాటు వద్దే.. వద్దు అంటూ ధర్నాలు, రాస్తారోకోలు, పాదయాత్రలతో నిరసన తెలుపుతున్నా.. మా గురించి ఒక్క మాట కూడా మా ట్లాడడం లేదు. అధికారులను పంపించి ప్రలోభాలకు గురిచేస్తున్నారు. రోటిబండ తండాలో జరిగిన లాఠీచార్జిలో పలువురు రైతులు సొమ్మసిల్లిపడిపోయారు. వారిని పరామర్శించేందుకు సీఎంకు సమయమేలేదా..? రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులే ముఖ్యమా.. రైతులు అవసరం లేదా..?

–గోపాల్‌నాయక్, ఫార్మా భూబాధిత రైతు, పులిచెర్లకుంట తండా, దుద్యాల

### భూములు పోతే.. వలస వెళ్లాల్సిందే..



అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని గెలిపించేందుకు మహారాష్ట్రలో ఉన్న ఈ ప్రాంత వలస కూలీలైన గిరిజనుల ఓట్లను వేయించా. ఆయన విజయం కోసం నిద్రాహారాలు మాని కష్టపడ్డా. కానీ, ఆయన సీఎం అయిన తర్వాత మా బతుకులనే రోడ్డు పాలు చేయాలని చూస్తున్నారు. గతంలో పంటలు పండకుంటే ముంబయి, పుణె, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లేది. ఇప్పుడిప్పుడే పంటలు పండించుకొని కుటుంబ సభ్యులతో జీవిస్తున్నా. రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయంతో మా భూములు పోతే మళ్లీ తండాను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే దుస్థితి వస్తుంది.

–విఠల్‌నాయక్, ఫార్మా భూబాధిత రైతు, పులిచెర్లకుంట తండా, దుద్యాల

### కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం..



ఫార్మా కంపెనీల ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ నాయకులు చాలా అత్యుత్సాహాన్ని చూపుతున్నారు. రైతులు భూములు ఇవ్వాలని.. లేకుంటే బలవంతంగా లాక్కుం టామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పచ్చని పంట పొలాలను కాలుష్యాన్ని వెదజల్లే కంపెనీలకు ఇచ్చి మేము ఎలా బతకాలి..?. రేవంత్‌రెడ్డి మేము వేసిన ఓట్లతోనే ఎమ్మెల్యేగా గెలిచి, సీఎం అయ్యారు. ఆయన ఈ ప్రాంత వాసి అయి ఉండి కూడా మమ్మల్ని బాధపెట్టడం తగదు.

–సోమ్లానాయక్, ఫార్మా భూ బాధిత రైతు,పులిచెర్లకుంట తండా, దుద్యాల

పరిగి, అక్టోబర్ 26 : కాలుష్య కారక ఫార్మా కంపెనీలకు తమ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని, సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ తమ పోరాటం ఆగదని ఫార్మా భూబాధిత రైతులు స్పష్టం చేస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు ఫార్మా కంపెనీల ఏర్పాటును నిరసిస్తూ ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలతో పోరాటాన్ని తీవ్రతరం చేశారు. ఎనిమిది నెలల క్రితమే దుద్యాల ప్రాంతంలో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. అందుకోసం మండలంలోని హకీంపేట, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల పరిధిలో సుమారు 1,375 ఎకరాల భూమిని సేకరించేందుకు చర్యలు చేపట్టగా .. తమ భూములను ఇచ్చేది లేదని.. తమ ప్రాంతంలో ఫార్మా విలేజ్ వద్దే.. వద్దు అంటూ ఆ ఐదు గ్రామాల రైతులు, స్థానికులు ప్రభుత్వ నిర్ణయంపై మండిపడుతున్నారు. సర్కారు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. భూములిస్తే తమ బతుకులు ఆగం అవుతాయని.. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపి.. రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తున్నది.

### వినతిపత్రాల నుంచి పాదయాత్ర వరకు..

ఫార్మా కంపెనీల ఏర్పాటును నిరసిస్తూ.. తమ భూములను ఇచ్చేదే లేదంటూ ఐదు గ్రామాల రైతులు కనిపించిన నాయకుడు, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం మొదలు వివిధ రూపాల్లో పోరాటాన్ని ఉధృతం చేశారు. తహసీల్దార్ నుంచి ప్రారంభించి కలెక్టర్, ప్రభుత్వ పెద్దలకు కూడా వినతిపత్రాలు ఇచ్చి తమ భూములను లాక్కోవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులకు మద్దతుగా ఈ నెల 9న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పోలేపల్లి నుంచి దుద్యాల వరకు శాంతియుతంగా పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించగా కాంగ్రెస్ సర్కారు పోలీసులతో ముందస్తు అరెస్టుల ద్వారా అడ్డుకున్నది. పాదయాత్ర కోసం వెళ్లిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి పరిగి ఠాణాకు తరలించారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు, రైతులను అరెస్టు చేసి పాదయాత్రను అడ్డుకున్నారు. అయినప్పటికీ రైతులు ఫార్మా కంపెనీల ఏర్పాటును నిరసిస్తూ చేపట్టిన నిరాహార దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. కాగా శుక్రవారం రోటిబండతండాలో జరిగిన ఘటనలో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు తమ భూములను తీసుకోవద్దంటూ వేడుకున్న గిరిజన రైతుల ముందు ఓ కాంగ్రెస్ నాయ కుడు అధికార దర్పాన్ని ప్రదర్శించగా.. కడుపు మండిన గిరిజన రైతులు సదరు నేతను ఉరికించి కొట్టారు. అతడి కారును ధ్వంసం చేశారు. రైతుల నుంచి తప్పించుకుని పంచాయతీ కార్యాలయంలో అతడు తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఫార్మా బాధిత రైతులు భూములను కాపాడుకునేందుకు సర్కార్‌పై పోరుకు సిద్ధమ య్యారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ.. భూములు ఇవ్వబోమని తెగేసి చెబుతున్నారు.

### పచ్చటి పొలాలను వదులుకొని ఎక్కడ, ఏవిధంగా బతకాలి..



నేను చదువుకోలేదు. నాకు వ్యవసాయం చేయడమే తెలుసు. ఫార్మా కంపెనీల కోసం భూములిచ్చి ఏ విధంగా బతకాలి. గ్రామాన్ని వదిలితే నా బతుకు శూన్యం. ప్రభుత్వం రూ. 10 లక్షలు ఇస్తామంటున్నది. ఆ డబ్బుతో ఎక్కడైనా భూమి వస్తుందా.?. ఇప్పుడు మా భూములు రూ. కోట్లలో పలుకుతున్నాయి. నా పిల్లలు కూడా పెద్దగా చదువుకోలేదు. వారు కూడా ఉన్న భూములనే సాగు చేసుకుని జీవిస్తారు. ఫార్మా విలేజ్‌కు భూములిచ్చేదేలేదు.

–పాండ్యానాయక్, ఫార్మా భూబాధిత రైతు, పులిచెర్లకుంట తండా, దుద్యాల

### గిరిజనులను బాధపెట్టొద్దు..



గిరిజనులు ఎవరికీ ఎటువంటి కీడు చేయరు. కష్టపడి బతుకుతారు. భూమిని నమ్ముకొని మా తాతల కాలం నుంచి ఈ తండాలోనే జీవిస్తున్నాం. మా తాతల దారిలోనే నేనూ వెళ్తున్నా. ఉన్న భూమిని సాగు చేసుకుని కుటుంబంతో ఆనందంగా జీవిస్తున్నా. ప్రభుత్వం మా పొలాల్లో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం తగదు. ఉన్న భూమిని తీసుకుంటే ఎలా బతకాలి. మాకు చావే శరణ్యం.

–చంద్యానాయక్, ఫార్మా భూ బాధిత రైతు, పులిచెర్లకుంట తండా, దుద్యాల

***విద్యుత్* సరఫరాలో ఓవర్ లోడ్ పెరిగిందా..? ఆ భారం మీదే అంటోంది... దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే వినియోగంలో ఉన్న పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్లపై కనెక్షన్ల భారం పెరిగి ఓవర్‌లోడ్ అయితే, దానిని అధిగమించేందుకు ఆ ప్రాంతంలోని వినియోగదారులే ఆ భారాన్ని భరించాలంటూ.. నిర్ణయాలు తీసుకుంటున్నది. క్షేత్ర స్థాయిలో ఉన్న ప్రతి విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్లను జీపీఎస్‌తో అనుసంధానం చేసి వాటిపై ఎంతలోడు ఉన్నదనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.***

-సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ)





# ఓవర్ లోడ్.. మీదే భారం

- వినియోగదారుల నడ్డి విరిచేలా డిస్కం చర్యలు
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు బాధ్యత కస్టమర్లపైనే

గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్ల పరిధిలో సుమారు 1.85 లక్షల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, వాటిపై చాలా చోట్ల ఓవర్ లోడ్ ఉందని గుర్తించారు. ఇలా గుర్తించిన ఓవర్ లోడ్‌ను అధిగమించేందుకు విద్యుత్ శాఖనే ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడమో, లేక అదనంగా మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే విద్యుత్ శాఖపై పడే భారాన్ని వినియోగదారులపై వేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నది. అందులో భాగంగానే రకరకాల కారణాలు చెబుతూ.. వినియోగదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అందులో భాగంగానే ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి అందులో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఎంత మొత్తంలో కరెంటు వినియోగం జరుగుతున్నదో గుర్తిస్తున్నారు. ఒక భవనంలో 20 కిలోవాట్ల సామర్థ్యం దాటితే.. సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు. అదే సమయంలో చిన్న చిన్న కాలనీలు ఉంటే.. ఆ ప్రాంతంలోని అదనంగా సొంత ఖర్చులతో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

### పెరుగుతున్న లోడ్..

గ్రేటర్ పరిధిలోని కోర్ సిటీతో పాటు శివారు ప్రాంతాల్లో కొత్తగా ఇండ్ల నిర్మాణాలు వస్తుండడంతో విద్యుత్ కనెక్షన్లు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే వినియోగంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వెళ్లే ఎల్ టీ లైన్ల నుంచే కొత్త కనెక్షన్లను విద్యుత్ శాఖ అధికారులు జారీ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పెరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ శాఖే అక్కడున్న కనెక్షన్లు, వాటి లోడును పరిగణనలోకి తీసుకొని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆ విషయాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. అడిగిన వారికల్లా కొత్త కనెక్షన్లు ఇవ్వడం వల్ల ఒక్కసారిగా ఆ ప్రాంతంలోని లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పెరిగి తరచూ విద్యుత్ అంతరాయాలు తలెత్తున్నాయి. ఈ విషయంలో విద్యుత్ శాఖనే సొంత ఖర్చులతో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడమో, అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికయ్యే ఖర్చును అంతా వినియోగదారులపై వేసేలా చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలోనే అపార్ట్‌మెంట్లకు మాత్రమే సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పిన అధికారులు..ఇప్పుడు వ్యక్తిగత ఇండ్లలో ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు, వినియోగం ఉంటే వాటి యజమానులు సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు చెప్పినట్లు చేసుకోవాలంటే గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్లలో 20వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగదారులే సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది తమకు ఎంతో భారంతో కూడుకున్నదని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వినియోగదారులపై భారం మోపకుండా, ఓవర్ లోడ్‌ను అధిగమించేలా శాఖాపరంగానే విద్యుత్ నెట్‌వర్క్‌ను విస్తరించి, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.



# మాటల్లోనే లాస్ట్‌మైల్ కనెక్టివిటీ!

## యాప్ ఆధారిత టాక్సీ సేవలకు ముసుగు

### మెట్రో ప్రయాణికులకు తప్పని పాట్లు

- సొంత వాహనాల్లోనే స్టేషన్ల దాకా ప్రయాణం
- కొత్తగా తెచ్చింది ఏమీ లేదు..

సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): మెట్రో ప్రయాణికుల సౌకర్యార్థం ఇంటి నుంచి మెట్రో స్టేషన్ వరకు, అక్కడి నుంచి పనిచేసే కార్యాలయాల వరకు ప్రజా రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకు రావాల్సిన బాధ్యత హెచ్ఎంఆర్‌పై ఉంది. నగరంలో మెట్రో సేవలు ప్రారంభమై ఆరేండ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ సరైన లాస్ట్ మైల్ కనెక్టివిటీ సౌకర్యం లేదని మెట్రో ప్రయాణికులు మండిపడుతున్నారు. ఈ కారణంగా ప్రయాణికులు ఇంటి నుంచి మెట్రో స్టేషన్ వరకు తమ సొంత వాహనాల్లోనే వస్తున్నారు. టెర్మినల్ స్టేషన్లు అయిన నాగోల్, మియాపూర్, ఎల్బీనగర్, రాయదుర్గం, పరేడ్ గ్రౌండ్, అమీర్‌పేట, హబ్సిగూడ మెట్రో స్టేషన్ వంటి ప్రాంతాల్లో వేలాది వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఇప్పటికే మెట్రో చార్జీలు ఎక్కువగా ఉన్నాయని, అయినా త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని మెట్రోలో ప్రయాణిస్తున్నారు. అయితే ఇదే అదనుగా భావిస్తున్న అధికారులు పార్కింగ్ ఫీజులు సైతం పెంచుతూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

#### షటిల్ సర్వీసులు ఏర్పాటు చేస్తే..

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా 69 కి.మీ మెట్రో నెట్‌వర్క్‌లో నిర్మించిన 59 మెట్రో స్టేషన్ల సమీప ప్రాంతాలకు ప్రత్యేకంగా షటిల్ సర్వీసులను మెట్రో సంస్థలే నడపాల్సి ఉంటుంది. కానీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ మొక్కుబడి చర్యలతో నెట్టుకొస్తున్నది. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ప్రముఖ యాప్ అగ్రిగేట్ సంస్థలైన ఓలా, ఉబర్, ర్యాపిడో, మన యాత్రీ వంటి కంపెనీలతో మెట్రో అధికారులు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇలాంటి ఒప్పందాల వల్ల రోజువారీ మెట్రో ప్రయాణికుల లాస్ట్‌మైల్ కనెక్టివిటీ అవసరాలు ఏ మాత్రమూ తీరడం లేదు. హైదరాబాద్ కేంద్రంగా యాప్ ఆధారిత సంస్థలు తమ సేవలను నగరం నలుమూలలా నిర్వహిస్తూనే ఉన్నాయి. వాటి ధరలు ఎక్కువగానే ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో అధికారులు లాస్ట్ మైల్ కనెక్టివిటీ అనే ముసుగు తొలగించడం ఏమిటని మెట్రో ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే మెట్రోస్టేషన్లను గుర్తించి, ఆయా స్టేషన్లకు 3–5 కి.మీ పరిధిలో నిరంతరం ఆటో రిక్షాలు, ఆర్టీసీ బస్సులు,ఇతర ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉండేలా చేస్తేనే లాస్ట్ మైల్ కనెక్టివిటీకి న్యాయం చేసినట్లు అవుతుందని రవాణా రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మెట్రో అధికారులు నగరంలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ విషయంపై ప్రధానంగా దృష్టి సారించి, షటిల్ సర్వీసులను ఏర్పాటు చేస్తే..మెట్రోలో ప్రయాణించే వారికి సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే అభిప్రాయాన్ని నగర వాసులు వ్యక్తం చేస్తున్నారు.

### మొక్కుబడిగా మెట్రో!

- సిటీ ప్రజా రవాణాపై చిత్తశుద్ధేది?
- అధ్యయనం లేకుండానే.. మార్గాల ప్రతిపాదన

సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రజా రవాణా వ్యవస్థల నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నగరంలో ప్రతి 50 లక్షల జనాభాకు 200 కి.మీ మెట్రో రైల్ నెట్ వర్క్ ఉండాలి. అలాంటిది మన మహానగరంలో ప్రస్తుతం కోటిన్నర జనాభా ఉండగా, భవిష్యత్తులో మరో 2 కోట్ల దాకా పెరిగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మహానగరంలో400 కిలోమీటర్ల మెట్రో రైలు నెట్‌వర్క్‌ను నిర్మించేలా దశలవారీగా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన హైదరాబాద్ మెట్రో అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలానుగుణంగా నగరంలో మెట్రో రైలు మార్గాలను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి, వాటిని నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి.. ప్రభుత్వానికి అందించాల్సిన మెట్రో అధికారులు.. చిత్తశుద్ధి కనబర్చడం లేదనే ఆరోపణలున్నాయి. ఏయే మార్గాల్లో మెట్రో కారిడార్లను నిర్మించాలో కచ్చితమైన సమాచారంతో ప్రభుత్వాలకు నివేదించాల్సిన మెట్రో యంత్రాంగం విఫలమవుతున్నది. రెండోదశ మెట్రో ప్రాజెక్టులో మరిన్ని మార్గాలను చేపట్టాల్సి ఉన్నా.. ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించిందని నగరవాసులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికి 3–4 మార్గాల్లో మెట్రో కారిడార్లను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నా, దాన్ని పక్కన ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వం ప్రకటించిన ప్రాంతానికి మెట్రో కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు, డీపీఆర్‌లు రూపొందించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. లేని నగరానికి మెట్రో మార్గాన్ని నిర్మించడంతో చూపుతున్న చిత్తశుద్ధి ఉత్తర హైదరాబాద్ ప్రాంతమైన మేడ్చల్, శామీర్‌పేట, కుత్బుల్లాపూర్,అల్వాల్, జీడిమెట్ల, దుండిగల్ వంటి ఏరియాలకు ఎందుకు మెట్రో మార్గాలను నిర్మించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అధ్యయనం లేకుండానే మార్గాలను ప్రతిపాదించినట్లు మండిపడుతున్నారు.